క్లుప్తంగా

మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్ రెడ్డి రాష్ట్ర స్థాయి సెర్ప్ ఉద్యోగులకు బేసిక్ వేతనాల్లో 23 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో కళ్యాణదుర్గంలో సెర్ప్ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ క్యాంపు కార్యాలయంలో గురువారం సెర్ప్ ఉద్యోగులు మంత్రిని కలిసి సన్మానించారు. సెర్ప్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో లైవ్‌లీ హుడ్ ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి, ఏపీఎంలు రామ్మూర్తి, రాజశేఖర్, హుస్సేన్, నీలామణి, సర్దానప్ప, ఐదు మండలాల సీసీలు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

విడపనకల్లు: మండలంలోని మాళాపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

ఉరవకొండ: ప్రజాగాయకుడు గద్దర్‌కు ప్రజాసంఘాల నేతలు, అభిమానులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రజాసంఘాల నేతలు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం గద్దర్ పోరాడారని గుర్తుచేశారు. ఉరవకొండ ప్రాంత వాసులతో గద్దర్‌కు అవినాభావ సంబంధాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శివన్న, సుల్తాన్, మల్లికార్జున, పాల్తూరు ఆనందరాజు, మీనుగ గోపాల్, చాబాల సర్పంచ్ జగదీష్, ఈశ్వరయ్య, జేఏసీ కన్వీనర్ సాకే హరి పాల్గొన్నారు.

పాడితో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

కూడేరు: పాడిని అభివృద్ధి పరుచుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి డాక్టర్ సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మరుట్ల–1వ కాలనీలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పాడిపశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం ఆయన పాడిపోషణపై పెంపకందారులు ,రైతులకు అవగాహన కల్పించారు. పాడి పెంపకం బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అనంతరం 154 పశువులకు లంపీ స్కిన్(ముద్ద చర్మపు వ్యాధి) సోకకుండా వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు శ్రీనివాసులు , వినోద్, గోపాల మిత్రలు రామాంజనేయులు, రాఘవయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ నారాయణస్వామి

కుందుర్పి: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం, నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు జరిపితే పదేళ్ల జైలు శిక్ష తప్పదని బాల్యవివాహాల నియంత్రణ ఆర్డీటీ జిల్లా కోఆర్డినేటర్ నారాయణస్వామి కంబదూరు ఐసీడీఎస్ సీడీపీఓ వనుజా అక్కమ్మ తదితరులు హెచ్చరించారు. గురువారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, రెవెన్యూ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, విద్యాశాఖ పర్యవేక్షణలో విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనాయుడు, ఎస్ఐ కృష్ణమూర్తి, హెచ్‌ఎం కిష్టప్ప, సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జ్యోతి మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలు, పెత్తందార్ల మధ్యనే పోటీ

- ఓటమి భయంతోనే అరాచకాలు సృష్టించేలా టీడీపీ కుట్రలు
- పుంగనూరు ఘటనతో బయటపడ్డ 'బాబు' రాక్షసత్వం
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి



గుమ్మఘట్ట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: రాష్ట్రంలో రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే సంగ్రామమేనని, ఈ యుద్ధంలో అంతిమ విజయం పేదల పక్షాన పోరాటం సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణ సమీపాన మద్దానేశ్వర ఆలయంలో గురువారం నియోజకవర్గంలోని డి హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్లు, రాయదుర్గం, అర్బన్, గుమ్మఘట్ట మండలాలకు చెందిన జేఏసీ మండల కన్వీనర్ల అధ్యక్షతన సచివాలయాల కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విప్ మాట్లాడారు.. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టుకొస్తోందన్నారు. ఈ కారణంగానే ప్రశాంతంగా ఉండే రాష్ట్రంలో విధ్వంసాలు సృష్టించేలా కుట్రలు పన్నుతున్నాడని ధ్వజమెత్తారు. పుంగనూరు, అంగళ్ల లో పోలీసులను చంపి అల్లకల్లోలం సృష్టించాలన్నదే బాబు ప్లాన్ అని గుర్తుచేశారు.

చరిత్రలో నిలిచిపోయేలా జగన్ పాలన

చరిత్రలో నిలిచిపోయేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని విప్ అన్నారు. పేదలు సంతోషంగా మూడు పూటలూ అన్నం తింటున్నారంటే జగన్ అమల్లోకి తీసుకొచ్చిన నవరత్న పథకాలే అందుకు కారణమని చెప్పుకొచ్చారు. ఒక్కో కుటుంబానికి రూ.1.50 లక్షల నుంచిరూ.10 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. ఇంతటి సుపరిపాలన పట్ల ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. నేరుగా డీబీటీ ద్వారా రూ.1.45 లక్షల కోట్లు చేర్చారని గుర్తుచేశారు. జగన్ ఉంటేనే అమ్మఒడి, చేయూత, ఆసరా, చేదోడు, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యాకానుక, నాడు–నేడు, ఆరోగ్యశ్రీ, 108, 104, రైతు భరోసా, నేతన్ననేస్తం లాంటి అనేక పథకాలు అందుతాయన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దని హితవుపలికారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఎన్నికల సంగ్రామంలోకి అడుగు పెట్టబోతున్నాం. సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అలా అని ఇళ్లకే పరిమితం కాకుండా ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులందరికీ బీమా పాలసీని సీఎం జగన్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కార్యకర్తలు, పార్టీ నాయకులకు ఏ అవసరం వచ్చినా వెన్నంటే ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం జగనన్న సైన్యం యాప్‌పై శిక్షకులతో అవగాహన కల్పించారు. గృహసారథులతో చర్చించే అంశంపై వివరించారు. టీడీపీ చేర్చిన దొంగ ఓట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఊపిరి ఉన్నంత వరకూ రాయదుర్గం ప్రజలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని గుర్తుచేశారు. రాజకీయాల్లో సంపదకోసమే కాలవ రాయదుర్గానికి వలస వచ్చాడన్నారు. 2024 ఎన్నికల్లో ఘోరంగా ఓడించి మరోసారి అనంతపురానికి తరిమేద్దామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, జేసీసీ కన్వీనర్లు రాళ్ల తిమ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, హనుమంతరావ్, బుజ్జి, ఆంజినేయులు, గొల్ల మురహరి, గుమ్మఘట్ట, రాయదుర్గం జెడ్పీటీసీలు పీఎస్ మహేష్, హొన్నే మల్లికార్జున, పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ నారాయణనాయక్, కౌన్సిలర్ గోవిందరాజులు, పార్టీ సీనియర్ నాయకులు ఆర్టీ కాంతారెడ్డి, జి సత్యనారాయణరెడ్డి, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గుమ్మఘట్ట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కె.పి.దొడ్డి గ్రామంలో గురువారం రెండో రోజూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ రమేష్, వైస్ ఎంపీపీలు రామకృష్ణారెడ్డి, జయమ్మతో కలిసి విప్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అంజదేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా, రాజకీయాల సిఫారస్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. 14 సంవత్సరాలు సీఎంగా పనిచేశానని చెప్పుకుంటున్న టీడీపీ నేత చంద్రబాబు స్థాయి దిగజారి మాట్లాడుతున్నాడన్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీకి ప్రజాదరణ లేకపోవడంతో విచక్షణ కోల్పోయిన చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు తెరలేపుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు ఉమేష్, అనిల్, రాజేష్, ఎంపీటీసీ గోవింద, వైస్ సర్పంచ్ రమేష్, పాఠశాల కమిటీ చైర్మన్ బోయ రమేష్, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, గంధవీడి తిప్పేస్వామి, పైదొడ్డి ఈరన్న, డీలర్ల సంఘం అధ్యక్షుడు రామాంజినేయులు, గలగల సిద్ధప్ప, గలగల సురేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, పాల్గొన్నారు.

మహిళలకు రుణాలివ్వండి

బెళుగుప్ప: జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న మహిళా సంఘాల్లోని సభ్యులకు రూ.35వే ల రుణం మంజూరు చేయాలని మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య ఆదేశించారు. గురువారం బెళుగుప్పలోని వైకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలను వేగవంతం అయ్యేలా హౌసింగ్ అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ఏఈ వెంకట శివారెడ్డి, ఏపీఎం ఆంజనేయులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, సీసీ, వీఏఎలు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించండి

రాయదుర్గం రూరల్: బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటా సర్వేకు రాజకీయ పార్టీల బూత్‌లెవెల్ పోలింగ్ ఏజెంట్లు సహకరించి తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలని తహసీల్దార్ మారుతి సూచించారు. స్థానిక తన చాంబర్ లో గురువారం రాజకీయ పార్టీ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. బీఎల్‌ఓలు చేపట్టిన ఇంటింటి సర్వే అంశంపై రాజకీయ పార్టీ నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ నాటికి 18 ఏళ్లు నిండుతున్న యువతీ యువకులందరూ కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కణేకల్లు, బొమ్మనహాళ్ తహసీల్దార్లు అబ్దుల్ రజాక్, శ్రీనివాసులతో పాటు వైఎస్సార్సీపీ నాయకులు పొరాళు గోవిందరాజులు, వైజాగ్ రవి, వామపక్ష నాయకులు పాల్గొన్నారు..

స్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

కూడేరు: మండల ంలోని మరుట్ల–2 కాలనీలో గురువారం విద్యుత్ స్తంభం నుంచి కింద పడడంతో లైన్‌మెన్ హెల్పర్‌గా పని చేస్తున్న రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాన్స్‌కో అధికారులు తెలిపిన వివరాలు మేరకు...ఓ రైతు పొలంలో విద్యుత్ మరమ్మతులకోసం ఎల్‌సీ తీసుకుని రామాంజనేయులు విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా కిందపడ్డాడు. 108లో అతడిని అనంతపురంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందపడ్డాడని స్థానికులు చెబుతున్నారు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో సీఐటీయూ నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు నాగరాజు, మధు, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు రాము, తిప్పేస్వామి బసవరాజు, వెంకటేశులు, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో 'డి హీరేహాళ్'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ హసీనభాను

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలం ప్రగతి పథంలో దూసుకుపోతోందని, గత పాతికేళ్లలో జరగని అభివృద్ధిని ఈ నాలుగేళ్లలో ప్రజలు చూసి ఆనందిస్తున్నారని ఎంపీపీ పవిత్ర, జెడ్పీటీసీ హసినబాను, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా చేపట్టిన అభివృద్ధి, పురోగతిపై అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ లు మాట్లాడారు.. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు దాటినా రోడ్డు ముఖమే ఎరుగని ఎన్నో గ్రామాలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కృషితో తారు రోడ్డు నిర్మాణాలు చేపట్టామన్నారు. 22 గ్రామాలకు శాశ్వతంగా శ్రీరామిరెడ్డి తాగునీటిని మరో నెలలో అందించబోతున్నామన్నారు. అలాగే రూ.2 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టామన్నారు. టీడీపీ హయంలో పచ్చచొక్కలు తొడిగిన వారికే పథకాలు అందే పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం సీఎం జగన్ ఆ విధానానికి స్వస్తి పలికారన్నారు. క్రాప్ ఇన్సూరెన్సులో ఒక టీడీపీ నాయకుడి ఖాతాకు రూ.10 లక్షలు పైనే జమైన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాస్కర్‌బాబు, తహసీల్దార్ ఈశ్వర్‌రెడ్డి, అధికారులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

కణేకల్లు: మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామంలో లాలూస్వామి పీర్లదేవుని హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. పీర్లచావిడిలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఎస్ఐ దుగ్గిరెడ్డి సమక్షంలో హుండీని తెరచి కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా రూ.4.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ధర్మకర్త, కణేకల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అశ్వర్థనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



డీఎస్పీ శ్రీనివాసులును సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

కళ్యాణదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్న కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులను పలువురు సన్మానించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో గురువారం దళిత సంఘం నాయకులు లాయర్ ఆంజనేయులు, ఏపీ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వెంకటంపల్లి కుళ్లాయప్ప, తిమ్మప్ప, మాజీ కౌన్సిలర్ కొల్లాపురప్ప తదితరులు డీఎస్పీని కలిసి అభినందించారు. పూలమాలలు వేసి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అరుణోదయ దళిత చైతన్య కమిటీ సభ్యులు శ్రీనివాసులు, విరుపాక్షి, రాము, తిమ్మరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీని సన్మానించారు. చల్లా కిశోర్ చౌదరి, సభ్యులు నారాయణ, లింగ ప్రసాద్, చల్లా రాజశేఖర్‌చౌదరి, మల్లికార్జున, దొణతిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'భూ సర్వే'

బ్రహ్మసముద్రం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ సర్వే పారదర్శకంగా చేపడతామని తహసీల్దార్ బాలకిషన్ అన్నారు. గురువారం మండలంలోని చెలిమేపల్లిలో భూసర్వే పై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి జగనన్న శాశ్వత భూహక్కు –భూ సురక్ష ప్రారంభిస్తామన్నారు. రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బూసప్ప, వీఆర్వో లక్ష్మన్న, సర్వేయర్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మృతి





తిరుపాల్‌శెట్టి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి చాబాల తిరుపాల్‌శెట్టి (80) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. ఎంపీ తలారి రంగయ్య, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి తదితరులు గురువారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అమరావతిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్ ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య, ప్రణయ్ తదితరులు తిరుపాల్‌శెట్టితో తమకున్న అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. సంతాపం తెలిపిన వారిలో మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు తదితరులున్నారు.

వీరభద్రస్వామికి భక్తుల విరాళం

విడపనకల్లు: మండలంలోని ఉండబండ వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు వివిధ రూపాల్లో విరాళాలు అందజేశారని ఈఓ రమేష్‌బాబు గురువారం తెలిపారు. మొలకల్మూర్ తాలూకా రాంపురం గ్రామానికి చెందిన భక్తుడు గద్దె ఆనందు ఆలయంలో రూ.లక్ష విలువ చేసే స్టీల్ క్యూలైన్ ఏర్పాటు చేశారు. గుంతకల్లు పట్టణానికి చెందిన వాసవి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ అధినేత రామోహన్ గుప్తా ఆలయంలో తాగునీటి సౌకర్యార్థం రూ.లక్ష విలువ చేసే ప్లాస్టిక్ పైపులు అందజేశారు. బెంగళూర్‌కు చెందిన సత్యనారాయణశర్మ రూ.70 వేలు విలువ చేసే మంచి నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దాతలకు ఈఓ ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

కుందుర్పి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎస్ఐ కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ ఎం.కృష్ణమూర్తి ఆధ్వర్యం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్వి చక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలన్నారు. కారు నడిపేవారు సీట్ బెల్టు వాడాలన్నారు, కార్యక్రమంలో పోలీసులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని నియమించండి

శెట్టూరు: మండలంలోని కనుకూరు గ్రామ సచివాలయంలో సిబ్బంది లేక ప్రజా సేవలకు అంతరం ఏర్పడింది. సచివాలయంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శి ఎనిమిది నెలలుగా విధులకు హాజరు కావడంలేదు. వెల్ఫేర్ అసిస్టెంట్ రాజీనామా చేశాడు. మహిళా పోలీస్, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు బదిలీపై వెళ్లారు. ఇక వీఆర్‌ఓ, హార్టికల్చర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు మాత్రం విధులో ఉన్నారు. వీఆర్‌ఓ తహసీల్దార్ కార్యాలయానికి, హార్టికల్చర్ అసిస్టెంట్ ఈ–క్రాప్ చేసేందుకు పొలాలకు వెళ్తుంటే సచివాలయం ఖాళీగా దర్శనం ఇస్తుంది. గురువారం గ్రామంలో పలువురు క్యాస్ట్, ఇన్‌కం, చేయూత సర్వీసుల కోసం వచ్చారు. కంప్యూటర్‌లో నమోదుచేసే ఉద్యోగులు లేకపోవడంతో ప్రజలు వెనుదిరిగి పోయారు. అధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరారు.

నేడు మండల సమావేశం

బెళుగుప్ప: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామచంద్ర గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి గౌరవ సభ్యులు, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు తప్పకుండా హజరు కావాలన్నారు.

బొమ్మనహాళ్‌లో 21న..

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21న ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ యు. పద్మ, ఎంపీడీవో షకీలాబేగం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

సంక్షిప్త సమాచారం

హావళిగిలో గ్రామసభ

విడపనకల్లు: మండలంలోని హావళిగి గ్రామంలో గురువారం పాల్తూరు ఎస్ఐ సురేష్‌బాబు పాత గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అన్నీ వర్గాల ప్రజలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు

కళ్యాణదుర్గం: చదువుకు పేదరికం అడ్డు కాకూడదని ఉపాధ్యాయుడు, సామాజికవేత్త బద్దే నాయక్ అన్నారు. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన వేల్పుల జోత్స్నకు కర్నూల్ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీట్ వచ్చింది. ఆ సీటుకు రూ.1.50 లక్షలు అవసరం కాగా విద్యార్థిని తండ్రి కూతురు కోసం దాదాపు రూ.1.25 లక్షలు సిద్ధం చేసుకున్నాడు. మిగిలిన రూ.25 వేలు లేకపోవడంతో కౌన్సిలింగ్‌కు వెళ్లలేక పోయారు. ఈ విషయం శెట్టూరు మండలం మాకొడికిలో పనిచేసే ఉపాధ్యాయుడు బద్దే నాయక్‌కు తెలియడంతో తనవంతుగా రూ.10 వేలు, తన మిత్రుడు ఎస్ఆర్ఐ నెమలి పుల్లారెడ్డి రూ.10 వేలు, యూనియన్ బ్యాంక్ లోకేష్ రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.25 వేలు ఆమెకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి సాయానికి జోత్స్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

శెట్టూరు: మండలంలోని కనుకూరు, మల్లేటిపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ పిల్లలు, సిబ్బంది హాజరును పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద అందజేస్తున్న టీహెచ్ఆర్ కిట్లు పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. అక్రమాలకు పాల్పడే అంగన్‌వాడీ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తే మెమోలు ఇస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వనితమ్మ, శ్రావణి, గౌరమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: జిల్లాకేంద్రంలో ఈ నెల 23న జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాయదుర్గం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు అభిషేక్, ఆంజనేయులు కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. జిల్లా మహాసభల అనంతరం సెప్టెంబర్ 28 నుంచి నాలుగు రోజుల పాటు బిహార్‌లోని బెగుసరై జిల్లాలో ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విష్ణు, మల్లికార్జున, అలీ, సింహాద్రి, నాని తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులను సస్పెండ్ చేయాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇషాక్ అనే విద్యార్థిపై ప్రిన్సిపాల్‌తోపాటు మరో ఇద్దరు అధ్యాపకులు దాడి చేశారని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. కళాశాల గేటు ఎదుటగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు బైటాయించి నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ తాలూకా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగిశివ, ఏఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కొట్రేష్ మాట్లాడుతూ ఆగస్టు 15న సెల్‌ఫోన్‌లో ఫోటోలు తీశాడనే నెపంతో విద్యార్థని విచక్షణారహితంగా కొట్టారన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతుల ఆందోళన

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లి సబ్ స్టేషన్ నుంచి వెంకటంపల్లికి విద్యుత్ సరఫరా సక్రమంగా కావడం లేదని రైతులు ఆందోళన చేపట్టారు. గురువారం కదిరిదేవరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట వెంకటంపల్లికి చెందిన పలువురు రైతులు ప్రధాన రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనల మేరకు కోతలు లేని కరెంట్ సరఫరా చేయాలని రైతులు కోరారు.